క్లుప్తంగా

నేటినుంచి స్పోర్ట్స్ స్కూల్‌కు క్రీడాకారుల ఎంపిక

లింగాలఘణపురం: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్‌కు నాలుగో తరగతి విద్యార్థులను ఎంపిక చేసి జిల్లా స్థాయికి పంపించనున్నట్లు ఎంఈఓ విష్ణుమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులు మూడో తరగతి పూర్తి చేసి 2016 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 2017 ఆగస్టు 31వ తేదీ మధ్య కాలంలో జన్మించి ఉండాలని, అంతేకాకుండా నాలుగో తరగతిలో చదువుతున్న వారై ఉండాలని, ఈ నెల 25న జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో జరిగే ఎంపికకు పంపించడం జరుగుతుందని తెలిపారు. అందులో ఎత్తు, బరువు, 30 మీటర్లు ఫ్లెయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బోర్డు జంప్, 800 మీటర్ల పరుగు, మెడిసిన్ బాల్‌పుట్, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్టులు నిర్వహించబడునని, ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 17న మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో జరిగే ఎంపికకు 9 గంటలకు ఆధార్ కార్డు, జనన ధృవీకరణ పత్రాలతో హాజరు కావాలని, పూర్తి వివరాలకు 9951253812 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

కొడకండ్ల: మండలకేంద్రంలోని ఉపకేంద్ర ఆవరణలో ఈ నెల 17వ తేదీ (మంగళవారం)విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు ఏర్పాటు చేసినట్లు విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్‌పర్సన్ ఎస్.వి.వేణుగోపాలాచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చటం, ఓల్టేజీ హెచ్చుతగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, లోపాలు ఉన్న మీటర్లు మార్చడం, నూతన సర్వీస్‌ల మంజూరు, అదనపు లోడ్ క్రమబద్ధీకరణ, సర్వీస్ పేరు మార్పు, విద్యుత్ బిల్లులలో వ్యత్యాసాలు, కేటగిరి మార్పు, సర్వీస్ రద్దు వంటి అంశాలపై వినియోగదారులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు ఇవ్వొచ్చని ఆయన తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు దరఖాస్తులు, ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందని, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

19న మండల స్థాయి క్రీడా పోటీలు

జనగామ రూరల్: జనగామ మండల స్థాయి క్రీడా ఎంపిక పోటీలు 19వ తేదీన స్థానిక మినీ స్టేడియం, ధర్మకంచ జనగామలో నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి శంకర్‌రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికల్లో పాల్గొనే అభ్యర్థులు మినీ స్టేడియానికి ఉదయం 9 గంటల లోపు హాజరుకావాలన్నారు. ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రంతో రావాలని సూచించారు.మరిన్ని వివరాలకు 9177101383 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

దేవరుప్పుల: జనగామ–సూర్యాపేట రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రగాయాలపాలైన సంఘటన సోమవారం మండల కేంద్రలో చోటుచేసుకుంది. మండలంలోని లయన్స్ క్లబ్ భవన్ ఏరియా దాటగానే చిన్నమదూరుకు చెందిన అంజి మోటరు సైకిల్‌పై సూర్యాపేట వైపు వెళ్తుంగా జనగామ వైపు ఓ కారు యూటర్న్ చేయడంతో ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. ఈ సంఘటనలో అంజికి తీవ్రగాయాలుకావడంతో స్థానికులు ఇచ్చిన సమాచారంతో అంబులెన్స్‌లో జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

సామూహిక అక్షరాభ్యాసం



విద్యార్థులతో ఎంఈఓ తదితరులు

తరిగొప్పుల: మండలకేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చేరిన విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్, టెస్ట్ బుక్స్ అందజేశారు. ఎంఈఓ జానకి, కాంప్లెక్స్ హెచ్‌ఎం బానోత్ రవీందర్, హెచ్‌ఎం సుజాత, ఉపాధ్యాయులు మంజుల, సునీత, అంగన్‌వాడీ టీచర్ సంతోష, సీఆర్పీ మహాలక్ష్మి పాల్గొన్నారు.

గానుగుపహాడ్‌లో..

జనగామ రూరల్: మండలంలోని గానుగుపహాడ్ గ్రామ అంగన్‌వాడీ సెంటర్–1 లో అమ్మ మాట– అంగన్‌వాడీ బాట నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా చేరిన చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఏఎన్‌ఎం శారద, ఆశ వర్కర్లు, ఆయ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీచండికా అమ్మవారి ఆలయంలో..

పాలకుర్తి టౌన్: సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. సోమవారం చండికా అమ్మవారి ఆలయంలో అధిక సంఖ్యలో చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. భక్తులు స్వామి వారికి అభిషేకం, అర్చనలు చేశారు. ఆలయ ఈఓ మోహన్‌బాబు, సూపరింటెండెంట్ వెంకటయ్య, అర్చకులు లక్ష్మన్న, డీవీఆర్‌శర్మ,అనిల్‌కుమార్, నాగరాజు,సిబ్బంది పాల్గొన్నారు.

‘భగీరథ’ నిర్వహణలో నిర్లక్ష్యం

- పంట పొలాల్లోనే పైపులు
- ఇబ్బందిపడుతున్న రైతులు

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం నిర్వహణ పనులను పలువురు అధికారులు నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు. దీంతో రైతులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. పదేళ్ల క్రితం మిషన్ నీరు ఊరూరా అందించాలని పైపులైన్ వేశారు. మండలంలోని పలు గ్రామాల్లో పైపులైన్ రోడ్ల వెంబడి, రైతుల పంట పొలాల మీదుగా తీసుకెళ్లారు. కొన్ని చోట్ల భూమి గట్టిగా ఉండడంతో పైపైనే పైపులు వేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ పైపులను అలాగే వదిలివేయడంతో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. పొలాలలు దున్నేందుకు ట్రాక్టర్లు వెళ్లాలన్నా పైపుల పైనుంచి వెళ్తే పగిలి పోతాయని దూరం నుంచి తీసుకెళ్తున్నారు. కొన్ని సార్లు పంట కొయ్యలను కాల్చినప్పుడు పైపులు కాలిపోయి నీరు బయటకు వస్తోంది. నీటి ఒత్తిడి, ఏయిర్ ప్రెషర్ కారణంగా కూడా పైపులు పగిలి నీరు బయటకు చిమ్ముతోంది. కాగా, పైపులు పగిలిన సమయంలో అధికారులు వాటికి మరమ్మతు పనులు చేస్తుండడంతో పంటలు దెబ్బతింటున్నాయి. పైపుల మరమ్మతు చేసే వరకు పలు గ్రామాలకు నీటి సరఫరా జరగకపోవడంతో స్థానికులు తాగునీటికోసం అవస్థలు పడుతున్నారు. అలాగే గ్రామాల్లో ఇళ్ల ఎదుట కూడా పైపులైన్ లీకేజీ అవుతుండడంతో కాలనీవాసులు కూడా ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మిషన్ భగీరథ పైపులు భూమి పైన కాకుండా పొక్లెయినర్‌లతో కందకం తీసి లోతుగా వేయాలని పలువురు గ్రామస్తులు, రైతులు కోరుతున్నారు.



బండనాగారం వద్ద పొలంలో ఉన్న భగీరథ పైపు



పొలానికి వెళ్లకుండా అడ్డుగా ఉన్న పైపు

తాగునీరు వృథాగా పోతోంది



బండనాగారం గ్రామంలో పలు చోట్ల తరచూ భగీరథ పైపులు లీకేజీ అవుతుండటంతో నీరు వృథాగా పోతోంది. ఎస్సీ కాలనీకి వెళ్లే దారిలో పలు మార్లు పైపులు లీకేజీ అవుతుండడంతో కాలనీవాసుల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. ఇటీవల మరమ్మతు చేయగా నెల రోజులుగా లీకేజీ కాలేదు. పైపుల మరమ్మతులు బందోబస్తుగా చేయాలి.

– మానెపల్లి నర్సింహులు, బండనాగారం

‘భూ భారతి’తో రైతులకు మేలు

- మార్కెట్ కమిటీ ఛైర్మన్ శివరాజ్ యాదవ్

జనగామ రూరల్: భూ భారతిచట్టంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ అన్నారు. సోమవారం మండలం శామీర్‌పేట గ్రామంలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. దరఖాస్తులు పరిశీలించి రైతులందరికీ న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సదస్సులను రైతులు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హుస్సేన్, డిప్యూటీ తహసీల్దార్ శేఖర్, ఆర్ఐ అన్వేష్, జీపీ కార్యదర్శి స్వప్న, నాయకులు పాల్గొన్నారు.



జనగామ రూరల్: దరఖాస్తులు స్వీకరిస్తున్న శివరాజ్, అధికారులు

తమ్మడపల్లి(జి)లో రెవెన్యూ సదస్సు

జఫర్‌గఢ్: తమ్మడపల్లి (జి) గ్రామంలో భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అనిల్‌బాబు, ఆర్ఐలు దేవేందర్, బలరాంతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

బచ్చన్నపేట: భూ సమస్యలు ఉన్న రైతులు రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ ఫణికిశోర్, డీటీ స్రవంతి సూచించారు. మండలంలోని కట్కూర్ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వారు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఎంఆర్ఐ వంశీ కృష్ణ, ఏఆర్ఐ మున్వర్ తదితరులు పాల్గొన్నారు.

కడవెండిలో దరఖాస్తుల వెల్లువ

దేవరుప్పుల: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అపరిష్కృత భూసమస్యల పరిష్కారం కోసం కొనసాగిస్తున్న భూభారతి రెవెన్యూ సదస్సులో దరఖాస్తుల వెల్లువ కనిపించింది. మండలంలోని కడవెండి రైతు వేదికలో భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఆడెపు ఆండాళ్ మాట్లాడుతూ వాస్తవిక ఆధారిత పత్రాలు, క్షేత్రస్థాయిలో సాగు చేస్తున్న రైతులకు కొత్త చట్టంకు లోబడి సముచిత న్యాయం చేసేందుకు తోడ్పాటు అందిస్తామన్నారు. కాగా, ఇప్పటి వరకూ జరిగిన సదస్సుల్లో కెల్లా అత్యంత మెజారిటీతో 207 మంది భూసమస్యలపై దరఖాస్తు చేసుకోవడం ప్రత్యేకతను సంతరించుకుంది. సదస్సు సజావుగా కొనసాగేందుకు పోలీసు బందోబస్తు నిర్వహించారు. అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు ‘ధర్తీ అబ’పై అవగాహన



కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న డీటీడీఓ ప్రేమకళ

తరిగొప్పుల: మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం భోజ్యాతండాలో పీఎం ధర్తీ అబ జాన్‌భగీధారి అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. డీటీడీఓ ప్రేమకళ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఆయుష్మాన్ భారత్, కుల ధృవీకరణ పత్రం, పీఎం కిసాన్‌కార్డు, జన్‌ధన్ ఖాతా, ప్రమాదబీమా, పెన్షన్, ఉపాధిహామీ, విశ్వకర్మ, ముద్రలోన్స్, ఐసీడీఎస్ బెనిఫిట్స్ తదితర అంశాలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీటీడీఓ రూపదేవి, ఏఓ నాగసాగర్, ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి, ఎంఈఓ జానకి, ఏపీఓ లింగయ్య, పశువైద్యాధికారి శశాంక్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ ఉదయ్ కిరణ్, ఏపీఎం పెన్షన్ ఇంచార్జి సురేందర్, ఆఐ ఆంద్రయ్య, జీపీ కార్యదర్శులు రాజేందర్, మమత, రాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న యువకులు

తరిగొప్పుల: మండలంలోని అంకుషాపూర్, వాచ్యవెంకట్‌తండా గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ యువజన నాయకులు సోమవారం డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ చేరారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ కండువ కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై యువకులు కాంగ్రెస్‌లో చేరడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వగలబోయిన యాదగిరి, చిన్నముత్తి యాదగిరి, భూక్య భాస్కర్, అర్జుల పోషిరెడ్డి,ఇంద్రారెడ్డి, కత్తుల సాయిరెడ్డి, బైకాని బాలరాజ్, ఎండీ యాకూబ్, అరుణ్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో తనిఖీలు

- కలెక్టరేట్ ఎదుట భారీగా పోలీసు మోహరింపు
- క్షుణ్ణంగా తనిఖీలు.. ఆ తర్వాతే లోనికి అనుమతి

జనగామ: ఇందిరమ్మ మూడవ విడుత ఇళ్లకు ఇంటి నంబర్లు వేయాలని సీపీఎం ధర్నా నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట పోలీసులు పెద్ద ఎత్తున మొహరించారు. గ్రీవెన్స్‌కు గంటన్నర ముందుగానే వెస్ట్‌జోన్ పరిధిలోని సీఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట తనిఖీలు మొదలు పెట్టారు. సామాన్యుల నుంచి ఉద్యోగుల వరకు రెవెన్యూ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఓకే అంటేనే లోనికి అనుమతించారు. తమ సమస్యను కలెక్టర్‌కు చెప్పుకునేందుకు పలు గ్రామాల నుంచి వచ్చే అర్జీదారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. కలెక్టరేట్‌కు వచ్చే వారికి సైతం నిబంధనలు ఉంటే, సమస్యను ధైర్యంగా చెప్పుకునే పరిస్థితి ఉండదు. కలెక్టరేట్ ఎదుట పరిస్థితి ఇలాగే కొనసాగితే సమస్యలను ఏకరువు పెట్టుకునేందుకు పల్లెల నుంచి వచ్చే అర్జీల సంఖ్య తగ్గే అవకాశం ఉందని మేధావి వర్గం అభిప్రాయ పడుతోంది. దీనిపై విమర్శలు సైతం వ్యక్తమవుతున్నాయి.



కలెక్టరేట్ ఎదుట తనిఖీలు చేస్తున్న పోలీసులు

సారూ ఒక్క నిమిషం..

మొర ఆలకించిన కలెక్టర్

గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు సమస్యలు చెప్పుకునేందుకు అర్జీదారులు రాగా కాస్తా ఆలస్యమైంది. దీంతో సమయం అయిపోగానే కలెక్టర్ రిజ్వాన్ బాషా బయటకు వచ్చే క్రమంలో అర్జీదారులు సారూ ఒక్క నిమిషం అంటూ వేడుకున్నారు. కలెక్టర్ వారి వద్దకు వచ్చి సమస్యను అడిగి తెలుసుకున్నారు. అందులో భాగంగా బెస్ట్ అవైలబుల్ పథకం కింద తన కుమారుడికి అరబిందో స్కూల్‌లో సీటు వచ్చిందని, సర్కారు నుంచి డబ్బులు రావడం లేదని బయటకు పంపించే ప్రయత్నం చేస్తున్నారని ఓ మహిళ కలెక్టర్‌తో మొర పెట్టుకుంది. కలెక్టర్ వెంటనే డీఈఓను పిలిపించి సంబంధిత స్కూల్ వాళ్లతో మాట్లాడాలని ఆదేశించారు. పదో తరగతి వరకు ఉచితంగా చదువు చెప్పాల్సిందే.. అమ్మా మీరు ఒక్కపైసా చెల్లించాల్సిన అవసరం లేదు.. నేను సైతం మాట్లాడుతా అంటూ కలెక్టర్ భరోసా కల్పించారు. అలాగే అక్కడే పలువురు అర్జీదారులు ఉండగా వారు చెప్పే విషయాలను ఓపికతో వింటూ సంబంధిత శాఖలకు వాటిని బదిలీ చేశారు.



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్

–జనగామ

పని కుదుర్చుకుని తిరిగివస్తుండగా..

రైలునుంచి పడి వ్యక్తి దుర్మరణం

రఘునాథపల్లి: హైదరాబాద్‌లో పని కుదుర్చుకుని తిరిగి స్వగ్రామానికి వెళ్తున్న ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు రైలునుంచి జారిపడి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం జనగామ జిల్లా రఘునాథపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి, కానిస్టేబుల్ నరేష్ కథనం ప్రకారం .. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం రుద్రంపూర్ గ్రామానికి చెందిన పుల్లూరి సుభాష్(46) హైదరాబాద్‌లో పనులు చూసుకునేందుకు వెళ్లాడు. అక్కడ పని కుదుర్చుకుని సోమవారం తెల్లవారుజామున రైలులో తిరిగి వస్తుండగా రఘునాథపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. దీంతో తీవ్ర గాయాలైన సుభాష్ అక్కడికక్కడే మృతిచెందాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని మృతుడి దగ్గర లభించిన మొబైల్ ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. జనగామ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య రమాదేవి, ఒక కూతురు ఉంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ పోలీసులు తెలిపారు.

వానలు కురవాలని గంగలింగ పూజలు



పూజ చేస్తున్న భక్తులు

చిల్పూరు: ఫతేపూర్ జీపీ పరిధిలోని బండలగట్టు శివగిరి శివగంగపార్వతి ఆలయంలో సోమవారం వానలు సకాలంలో కురవాలని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాత, శాశ్వత అర్చకులు వేల్పుల లక్ష్మీగట్టయ్య, భక్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

‘ఇద్దరు పిల్లల నిబంధనను రద్దు చేయాలి’




కొడకండ్ల: త్వరలో జరుగబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధనను రద్దు చేయాలని జీసీసీ మాజీ చైర్మన్ అభిమన్‌గాంధీ కోరారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కామిడి మహేందర్‌రెడ్డి, నేతి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మేక మృతి

దేవరుప్పుల: నీర్మాలలో వ్యవసాయ క్షేత్రాల్లోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సపోర్టు వైరుకు తాకడంతో మేత మేస్తున్న నల్ల స్వామికి చెందిన మేక సోమవారం మృత్యువాత పడింది. ఈ విషయమై సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సింగారపు రమేష్ మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మల వద్ద సరైన పరిరక్షణ చర్యలు లేకపోవడంతో ఘటనలు చోటుచేసుకుంటున్నాయన్నారు. మూగజీవాల బాధితులకు శాఖపరంగా పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

‘కుట్ర కేసులతో బీఆర్‌ఎస్‌ను అణిచివేయలేరు’



దేవరుప్పుల: ప్రజాపాలన పేరిట మోసపూరిత పాలన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాలపై ఎన్ని కుట్ర కేసులు పెట్టినా బీఆర్‌ఎస్‌ను అణిచివేయలేరని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పల్ల సుందర్‌రామిరెడ్డి అన్నారు. సోమవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఏసీబీ విచారణ తరుణంలో హైదరాబాద్ బీఆర్‌ఎస్ తెలంగాణ భవన్‌కు మండలంలోని బీఆర్‌ఎస్ నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్, తీగల దయాకర్, రామ్‌సింగ్, బస్వమల్లేషం, పాము మోహన్ తదితరులు ఉన్నారు.

వీఎస్‌ఆర్ నగర్‌లో విజృంభిస్తున్న జ్వరాలు

బచ్చన్నపేట: వంగ సుదర్శన్‌రెడ్డినగర్ గ్రామంలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. గ్రామంలో 500 మంది ఉండగా ఇప్పటికే 20 మంది జ్వరాలతో బాధపడుతున్నారు. పలువురు డెంగీ తో ప్లేట్‌లెట్లు పడిపోయి ప్రైవేటు ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారు. సంబంధిత వైద్యాధికారులు గ్రామంలో హెల్త్ క్యాంపు నిర్వహించి జ్వరాల బారిన పడిన వారికి జాగ్రత్తలు వివరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నివాళి

దేవరుప్పుల: మండలంలోని కడవెండికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు పెద్ది సోమయ్య తల్లి సత్తెమ్మ మృతి చెందింది. కాగా, సోమవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు తదితరులు సత్తెమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సురేష్‌బాబు, శ్రీనివాస్, రవీందర్, యాకస్వామిపులిగిల్ల వెంకన్న, ధరగాని కోటేష్ తదితరులు ఉన్నారు.

పేదింటి కల కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

పాలకుర్తి టౌన్: పేదింటి కల కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అని గూడూరు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బెల్లి దేవేందర్ అన్నారు. సోమవారం గూడూరులో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుడు మేకల ఎర్రయ్య ఇంటి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. కోడూరు మురళీధర్‌రెడ్డి, గుగ్గిళ్ల ఆదినారాయణ, మాజీ సర్పంచ్ మాచర్ల పుల్లయ్య, అనుముల మహేందర్‌రెడ్డి, పూజారి ఉమామహేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి

బచ్చన్నపేట: నిబంధనలు పాటించని మండలంలోని ప్రైవేట్ పాఠశాలల యజమానులపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి దండుగుల మురళీకృష్ణ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాల ఎదుట నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. అఖిల్, శ్రీధర్, రాకేష్, రవితేజ, సతీష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

దేశ భద్రత, అభివృద్ధి మోదీతోనే సాధ్యం



జనగామ రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రమేశ్



నర్మెట: మాట్లాడుతున్న వెంకట్ రెడ్డి



బచ్చన్నపేట: మాట్లాడుతున్న ఊడుగుల రమేశ్

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రమేశ్

జనగామ రూరల్/స్టేషన్‌ఘన్‌పూర్/చిల్పూరు/నర్మెట/బచ్చన్నపేట/తరిగొప్పుల: దేశ భద్రత, సంక్షేమం, అభివృద్ధి ప్రధాని మోదీతోనే సాధ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ అన్నారు. జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ సంకల్ప సమావేశాలకు ముఖ్య అతిథులుగా నాయకులు పాల్గొని మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పార్టీ శ్రేణులు ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలని కోరారు. ఆయా సమావేశాల్లో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఊడుగుల రమేశ్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దేవరాయ ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి శోభన బోయిన శివరాజ్ యాదవ్, కిసాన్ మోర్చా మాజీ జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి వెంకట్ రెడ్డి, బి.నవీన్ రెడ్డి, ఎల్లయ్య, నవీన్‌రెడ్డి, తోకల సంపత్‌రెడ్డి, బైరగోని ఆంజనేయులు, చెవుల రాజు, లక్ష్మీ నరసయ్య, దేవరాయ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి



దాతల నుంచి లాప్‌టాప్ అందుకుంటున్న ఎంఈఓ వెంకట్‌రెడ్డి

బచ్చన్నపేట: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ పాటు పడాలని మండల విద్యాధికారి ఇర్రి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం దబ్బగుంటపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం లింగాల లక్ష్మీనారాయణరెడ్డి విద్యార్థుల కోసం లాప్‌టాప్, డాక్టర్ శ్రావణి రాగిజావ తాగడానికి గ్లాసులు అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు బాలకిషన్‌రావు, రొండ్ల దినేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు అమీర్, కనుకయ్య, శ్రీవిధ్య, దీక్షిత, మమత, పద్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్, పలకల పంపిణీ

జనగామ: పట్టణంలోని ప్రెస్టన్ పాఠశాల విద్యార్థులకు 1995–96 పదో తరగతి పూర్వ విద్యార్థులు సోమవారం నోట్ బుక్స్, పలకలు, స్టేషనరీని అందించారు. పేద విద్యార్థులకు సహకారం అందించాలని ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సమ్మ కోరిక మేరకు పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చారన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బక్క ప్రవీణ్, సిబ్బంది జాన్సన్, జయశీల, పూర్వ విద్యార్థులు ఎ.ప్రసాద్, మల్లేష్, ఆదిలక్ష్మి, మాధవి, కృష్ణ, ప్రమోద్, శ్రీధర్, పవన్, యేల కృష్ణ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ రఘునాథపల్లి ఆధ్వర్యంలో..

రఘునాథపల్లి: లయన్స్‌క్లబ్ ఆఫ్ రఘునాథపల్లి ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పలకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కందుల అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్ కార్యదర్శి కరింకొండ ప్రదీప్, కోళ రాజుగౌడ్, పూర్వ క్లబ్ అధ్యక్షుడు మంచోజు లక్ష్మీనారాయణ, కూరెల్లి వేదకుమార్, ఎండి రహీంగుప్తా, హెచ్‌ఎం రాణి పాల్గొన్నారు.



జనగామ: నోట్ బుక్స్, స్టేషనరీ అందుకున్న విద్యార్థులతో పూర్వ విద్యార్థులు